అర్హులందరికీ 'డబుల్' ఇళ్లు

డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్



ఇంటి తాళాలు అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, మంత్రి మహమూద్ అలీ

అడ్డగుట్ట: అర్హులందరికీ 'డబుల్' ఇళ్లు మంజూరు చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. అడ్డగుట్ట డివిజన్‌లోని ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లో 48 మందికి మంజూరు చేసిన డబుల్ బెడ్రూమ్‌లను గురువారం ఆయన హోంమంత్రి మహమూద్ అలీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ స్థలాల కొరత కారణంగా నాలుగు ప్రదేశాల్లో మాత్రమే 419 ఇళ్లను నిర్మించగలిగామని, మిగతా వారికి ఇతర ప్రాంతాల్లో అందించేందుకు కృషి చేస్తామన్నారు. అడ్డగుట్టలో ప్రభుత్వ ఆస్పత్రిని నిర్మిస్తామని, ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌ను సమస్యల రహిత ప్రాంతంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. డబుల్ బెడ్రూమ్‌లు రాని ఏసీఎస్‌నగర్ వాసులు ఆందోళన చెందవద్దని అర్హులైన మిగిలిన వారికి నగర శివారులోని బాటాసింగారం, నాగోల్, జవహర్‌నగర్‌లో కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మహమూద్ అలీ మాట్లాడుతూ.. పేద ప్రజల కలలను సాకారం చేస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. పేదల ప్రయోజనాల పరిరక్షణలో డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ కృషి మరువలేనిదన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు బీఆర్‌ఎస్ సర్కారు చిరునామాగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ సురేష్‌కుమార్, జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో వసంత కుమారి, జలమండలి జీఎం రమణారెడ్డి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా రెడ్డి, కార్పొరేటర్లు లింగాని ప్రసన్న, సామల హేమ, రాసూరి సునీత పాల్గొన్నారు.


స్వీకార్ ఉప్‌కార్ సేవలు అభినందనీయం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దేవిప్రసాద్ రావు

రసూల్‌పురా: స్వీకార్ ఉప్‌కార్ సంస్థలో వికలాంగులకు అందజేస్తున్న సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవిప్రసాద్ రావు అన్నారు. స్వీకార్ ఉప్‌కార్‌లో గురువారం ప్రపంచ ఆటిజం అవగాహన వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. స్వీకార్ ఉప్‌కార్ వ్యవస్థాపకులు డాక్టర్ పి. హన్మంతరావు చేస్తున్న సేవలను గుర్తించి ఇటీవల పద్మశ్రీ అవార్డు అందజేశారన్నారు. రిహాబిలిటేషన్ సెంటర్‌లో వికలాంగులకు చేస్తున్న సేవలతో పాటు అతి తక్కువ ఫీజుతో వివిధ విద్య అందజేస్తున్నారని ప్రశంసించారు. అనంతరం వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, పోటీల్లో పాల్గొన్న ఆటిజం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వారోత్సవాల్లో భాగంగా ఆటిజం విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన, ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల విద్యార్థులకు సెమినార్, పోస్టర్ ప్రజంటేషన్, వికలాంగులకు ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పి. బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో శిల్పాపన్నాల్, తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ మోత్కూరి రామచందర్ పాల్గొన్నారు.

సింధూర శోభితం



హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గురువారం సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్లలో హనుమాన్ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, కార్పొరేటర్లు, వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆయా ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

–సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం



జయంతి వేడుకలో పాల్గొన్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



తుకారాంగేట్‌లో నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, హోంమంత్రి మహమూద్ అలీ



బల్కంపేటలో జరిగిన హనుమాన్ జయంతిలో మర్రి శశిధర్‌రెడ్డి



సుభాష్‌నగర్‌లో జరిగిన హనుమాన్ జయంతిలో వైఎస్సార్‌సీపీ నేత వెల్లాల రామ్మోహన్



సెకండ్‌బజార్‌లోని అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న శ్రీగణేష్



చిన్నకమేళా హనుమాన్ దేవాలయంలో మన్నె క్రిశాంక్ పూజలు



శోభాయాత్రను ప్రారంభిస్తున్న గజ్జెల నాగేశ్, సాద కేశవరెడ్డి

ఓయూలో 'బలగం'కు బారులు

ఉస్మానియా యూనివర్సిటీ: బలగం చిత్రానికి ఓయూలో విశేష స్పందన లభించింది. గురువారం యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియం కమ్ థియేటర్‌లో ప్రదర్శించిన బలగం చిత్రాన్ని వీక్షించేందుకు అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. సినిమా నిజ జీవితానికి దగ్గర ఉందని పలువురు విద్యార్థులు అభిప్రాయపడ్డారు. అనంతరం బలగం నిర్మాత, ఓయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థి (2007 బ్యాచ్) రమేష్, నటుడు సత్యం, కాకీ కథ చెప్పిన వడ్డేపల్లి కృష్ణను వీసీ ప్రొ.రవీందర్ సన్మానించి జ్ఞాపికను అందజేశారు.



బలగం చిత్రానికి హాజరైన విద్యార్థులు

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



పికెట్‌లో జెండావిష్కరణలో పాల్గొన్న బీజేపీ నాయకులు



జెండా ఎగురవేస్తున్న బీజేపీ నాయకులు

సనత్‌నగర్: సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు కన్నూరి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో గురువారం సనత్‌నగర్ నెహ్రూపార్కు వద్ద బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్రమోదీ నాయకత్వంలో ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. స్వచ్ఛ భారత్, జన్‌ధన్ యోజన వంటి బృహత్తర కార్యక్రమాలను ప్రవేశపెట్టిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంజర్ల సదాశివయాదవ్, నేతలు లింగంపల్లి నర్సింగరావు, మూల రవీందర్, దయానంద్, యేచెస్ సురేష్, ఆకూరి శ్రీనివాసరావు, కన్నూరి చంద్రకుమార్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బీజేపీ బలీయమైన శక్తిగా ఎదుగుతోంది..

కంటోన్మెంట్: మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ బలీయమైన శక్తిగా ఎదుగుతోందని ఆ పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ సామల సత్తిరెడ్డి అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం కంటోన్మెంట్ నాలుగో వార్డు పికెట్‌లో స్థానిక నేతలతో కలిసి పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటోన్మెంట్‌లోనూ బీజేపీకి రోజురోజుకీ ఆదరణ పెరుగుతోందన్నారు. కంటోన్మెంట్ వేదికగా శనివారం జరిగే ప్రధాన మంత్రి సభకు భారీ సంఖ్యలో బీజేపీ కార్యకర్తలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విజయానంద్, సతీష్, టోపీ శంకర్ నాగభూషణం రెడ్డి పాల్గొన్నారు.

బౌద్ధనగర్: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీ రానున్న కాలంలో తెలంగాణలోనూ జెండాను ఎగరవేయనుందని ఆ పార్టీ నేతలు రవిప్రసాద్ గౌడ్, స్వరూప గౌడ్, రాజు, సత్యనారాయణ, కుమార్, సంపత్, డేవిడ్ రాజు ధీమా వ్యక్తం చేశారు.

ఆలయాల అభివృద్ధికి ముందుకు రావడం అభినందనీయం

అమీర్‌పేట: ఆలయాల అభివృద్ధి దాతలు ముందుకు రావడం అభినందనీయమని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా అమీర్‌పేట హనుమాన్ దేవాలయాన్ని గురువారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా దాతల సహకారంతో రూ.15 లక్షలతో షెడ్డు, ప్రహరీ నిర్మాణం, ఆలయంలో గ్రానైట్ ఫ్లోరింగ్, పెయింటింగ్ వంటి పనులు పూర్తి కాగా వాటిని పరిశీలించారు. అనంతరం బల్కంపేట హనుమాన్ వ్యాయామశాలలో జరిగిన హనుమాన్ జయంతి వేడుకలకు హాజరయ్యారు. మంత్రి వెంట విఠలయ్య, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి ఉన్నారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి



సనత్‌నగర్: వడదెబ్బకు గురై ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..ఫతేనగర్ లాల్‌బహదూర్‌శాస్త్రినగర్‌లోని హనుమాన్ గుడి వద్ద ఓ వ్యక్తి భిక్షాటన చేస్తుండేవాడు. బుధవారం సాయంత్రం ఎలాంటి చలనం లేకుండా పడిఉన్న అతడిని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. 108 సిబ్బందితో అక్కడికి వచ్చి పరీక్షించగా మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. వడదెబ్బ తగిలి మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వివరాలు తెలియరాలేదని మృతునికి సంబంధీకులు ఉంటే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

మద్యం విక్రేతల రిమాండ్

చిలకలగూడ: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురిని రిమాండ్‌కు తరలించిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పార్శీగుట్టకు చెందిన రమేష్, శ్రీధర్, రామ్ స్థానికంగా చికెన్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మద్యం దుకాణాలకు సెలవు ఉన్న నేపథ్యంలో మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి చికెన్ షాపులో నిల్వఉంచారు. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం రాత్రి చికెన్‌షాపుపై దాడి చేసిన 42 మద్యం బాటిళ్లతో పాటు రూ. 2880 నగదు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని ముగ్గురిని రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

'మళ్లీ కేంద్రంలో బీజేపీదే అధికారం'

అమీర్‌పేట: కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటన నేపథ్యంలో అమీర్‌పేట కార్పొరేటర్ సమకూర్చిన ప్రచార రథాలను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో దూసుకుపోతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రచార రథాల ద్వారా ప్రజలకు వివరిస్తామని చెప్పారు.రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు నూకలు చెల్లాయని విమర్శించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కేతినేని సరళ, పార్టీ మహంకాళీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్, ఇన్‌చార్జి నాగురాం నామోజీ, శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న సాయిబాబా

చిలకలగూడ : చిలకలగూడ సాయిబాబా సమేత బాలాంజనేయస్వామి ఆలయ వార్షిక ఉత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మేళతాళాలు, భాజభజంత్రీలు, వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ఆలయ ఫౌండర్ ట్రస్టీ నాగులూరి సాయిబాబా ఆంజనేయస్వామి పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. సుప్రభాతం, గణపతిపూజ, సింధూర అలంకరణ, ధ్వజారోహణం, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించి, స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మూడు రోజుల పాటు ఆలయ వార్షిక వేడుకలను భక్తిశ్రద్ధలతో కొనసాగుతాయని సాయిబాబా తెలిపారు. బాలాంజనేయుని విగ్రహానికి పుష్పాలు, పండ్లు తమలపాకులతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారు శుక్రవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు నరసింహారావు, కేఆర్ గాంధీ, గిరిధర్‌బాబు, రాధాకృష్ణశర్మ, రమేష్‌చంద్ర, చంద్రకళ, స్వరూపరాణి, ఆంజనేయులు, సతీష్‌కుమార్, ప్రమోద్ కుమార్, తుమ్మ శ్రీను, శ్రీనివాసగౌడ్, రవిశంకర్ అర్చకులు ఫణిశర్మ పాల్గొన్నారు.

ప్రధాని రాకను వ్యతిరేకిస్తున్నాం: సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

అడ్డగుట్ట: విభజన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్న బీజేపీ ప్రభుత్వ తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని సీపీఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి అన్నారు. గురువారం అడ్డగుట్టలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 8న సికింద్రాబాద్‌కు రానున్న మోదీ రాకను వ్యతిరేకిస్తూ హైదాబాద్ జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున 'గో బ్యాక్ నరేంద్ర మోదీ' నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాలను అస్థిరపరుస్తూ ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్న మోదీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఈ నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు కాంపల్లి శ్రీనివాస్, ఉమర్ఖాన్, శ్రీనివాస్, పాకాల యాదగిరి, బాలరాజ్, రామ్‌చందర్ తదితరులు పాల్గొన్నారు.

కుమ్మేసిన వాన .. నేలకొరిగిన చెట్లు



పద్మారావునగర్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. వడగండ్ల వాన కారణంగా రోడ్లన్నీ జలమయమయ్యాయి. ముఖ్యంగా ప్రధాన రహదారుల్లో వరదనీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. కరెంట్ సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బంది పడ్డారు. పద్మారావునగర్ ప్రధాన రహదారిలో వర్షానికి చెట్టు కూలి రోడ్డు పై పడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

ఆస్పత్రి ఏర్పాటయ్యే దాకా ఉద్యమిస్తాం


రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న మాణికేశ్వర్‌నగర్ వాసులు

లాలాపేట: తమ బస్తీలో ప్రభుత్వ దవాఖానాను ఏర్పాటు చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఓయూ మాణికేశ్వర్‌నగర్ అఖిలపక్షం నాయకులు అన్నారు. ఈ మేరకు చేయి చేయి కలుపుదాం హాస్పిటల్‌ను నిర్మిద్దాం అంటూ వడ్డెర బస్తీ కమాన్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం రెండవ రోజుకు చేరుకుంది. మధ్యాహ్నం కురిసిన వర్షాన్ని సైతం లెక్క చేయకుండా దీక్షలను కొనసాగించారు. సాయంత్రం మాణికేశ్వర్‌నగర్ డివిజన్ అధ్యక్షులు గండికోట విజయ్‌కుమార్ నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. రాంచందర్, ఎల్లయ్య, గణేష్, కుమార్, నాగరాజు, పెద్దులు, రవి హరి, శేఖర్, మురళి కృష్ణ, శివ, ప్రభాకర్, వెంకన్న, నర్సింగరావు, మహేశ్, గోపి, చెర్రి పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న మంత్రి


శోభాయాత్రలో ఫలహారాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్

భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర



రాంగోపాల్‌పేట్: గాలిగూడ నుంచి తాడ్‌బంద్ హనుమాన్ దేవాలయం వరకు సాగే హనుమాన్ శోభాయాత్ర గురువారం శోభాయమానంగా సాగింది. సాయంత్రం 7.20 గంటలకు ఆర్పీరోడ్‌లోని బాటాకు చేరుకోవడంతో ఆ ప్రాంతమంతా జెండాల రెపరెపలు, డీజేల హోరు, యువత డ్యాన్సులతో మార్మోగింది. బాటా నుంచి ప్యారడైజ్ వరకు వివిధ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భక్తులకు మజ్జిగ, ప్రసాదాలు, మంచినీళ్లు అందించారు. పలువురు ప్రముఖులు వేదికల మీదకు వచ్చి భక్తులకు స్వాగతం పలికారు.


భక్తులతో కిక్కిరిసిన సుభాష్‌రోడ్


స్వాగత వేదికపై ప్రముఖులు

కోల్ మైన్స్ స్కీంను సవరించి రూ. 15 వేల పింఛన్ చెల్లించాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కోల్ మైన్స్ పింఛన్ స్కీం 1998ను సవరించి కనీస పింఛన్ రూ. 15 వేలు చెల్లించాలని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డి.రామచందర్‌రావు, ప్రధాన కార్యదర్శి బూపల్లి భానయ్య డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... కాంట్రిబ్యూటరీ పోస్టు రిటైర్మెంట్ స్కీం కార్డుల వైద్య ఖర్చుల పరిమితి రూ. 8 లక్షలు కాకుండా అపరిమితంగా చెల్లించాలన్నారు. విశ్రాంత ఉద్యోగులకు కంపెనీ గెస్ట్‌హౌస్‌లో వసతి కల్పించాలని, సీపీఆర్ఎంఎస్ కార్డు ద్వారా వైద్యం పొందిన వారికి రీయింబర్స్‌మెంట్ బిల్లుల చెల్లింపులో జాప్యం చేయవద్దని, వివిధ ఏరియాల్లో ఖాళీగా ఉన్న క్వార్టర్స్‌ను విశ్రాంత ఉద్యోగులకు ఇవ్వాలని కోరారు.

జాబ్‌మేళాపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమీక్ష

అంబర్‌పేట: కేంద్ర ప్రభుత్వం అర్హులైన నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. గురువారం శివం రోడ్డు అడ్వాన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో వచ్చే నెలలో నిర్వహించే మెగా జాబ్‌మేళాపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సుమారు 10 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా జాబ్‌మేళా నిర్వహిస్తామని ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్‌లు బి.పద్మ వెంకట్‌రెడ్డి, అమృత, అడ్వాన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ అధికారులు, స్థానిక బీజేపీ నేతలు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు



సనత్‌నగర్: టమాటా రూ.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీ మిర్చి 28, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 45, పందిరి బీర 45, క్యాబేజీ 11, క్యారెట్ 17, దొండ 23, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 55, గోకరకాయ 50, కీర 13, దోసకాయ 20, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 19, చామగడ్డ 55, మొరంగడ్డ 19, కందగడ్డ 28, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ 4–6, ముల్లంగి 3–5. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.